# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 19-08-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- రాజస్థాన్, ఒడిస్సా రాష్ట్రాల్లో ట్రాఫిక్ రద్దీని నియంత్రించేందుకు రెండు మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు కేంద్ర మంత్రివర్గం ఈరోజు ఆమోదం తెలిపింది.
- బీహార్ ఎన్నికల జాబితాలో చేపట్టిన ప్రత్యేక సవరణలపై విపక్షాలు ఆందోళన చేపట్టడంతో పార్లమెంటు ఉభయ సభలు రేపటికి వాయిదా పడ్డాయి.
- సుప్రీం కోర్టు పూర్వ న్యాయమూర్తి బి. సుదర్శన్ రెడ్డిని ఉపరాష్ట్రపతి ఎన్నికలకు భారత కూటమి అభ్యర్థిగా ప్రకటించారు.
- ముంబై నగరంలో గత కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా జనజీవనం స్తంభించింది.

====================

ఒడిస్సాలో 8,307 కోట్ల రూపాయలతో ఆరు వరుసల భువనేశ్వర్ బైపాస్ నిర్మించేందుకు కేంద్ర మంత్రి వర్గం ఆమోదం తెలిపింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన ఈరోజు న్యూ ఢిల్లీలో కేంద్ర మంత్రివర్గం సమావేశమయ్యింది. ఆ వివరాలను కేంద్ర సమాచార ప్రసార శాఖా మంత్రి అశ్విని వైష్ణవ్ పాత్రికేయులకు వెల్లడించారు. రాజస్థాన్‌లోని కోటా-బుండిలో 1,507 కోట్ల రూపాయలతో నూతన విమానాశ్రయాన్నినిర్మించేందుకు మంత్రి మండలి ఆమోదం తెలిపిందన్నారు. ఈ భువనేశ్వర్ బైపాస్.. ఒడిశా, ఇతర తూర్పు రాష్ట్రాలకు కటక్, భువనేశ్వర్, ఖుర్దా నగరాల నుండి భారీ ట్రాఫిక్‌ను మళ్లించడం ద్వారా గణనీయమైన ప్రయోజనాన్ని చేకూరుస్తుందని అశ్విని వైష్ణవ్ వివరిస్తూ.....

(వాయిస్ 34 సెకన్లు)

====================

బీహార్ ఎన్నికల జాబితాలో చేపట్టిన ప్రత్యేక సవరణలపై విపక్షాలు ఆందోళన చేపట్టడంతో ఈరోజు పార్లమెంటు ఉభయ సభల కార్యకలాపాలకు అంతరాయం ఏర్పడింది. లోక్‌సభ మూడుసార్లు వాయిదా పడగా, రాజ్యసభ ఒకసారి వాయిదా పడింది. మూడవ వాయిదా తర్వాత సాయంత్రం 4 గంటలకు లోక్‌సభ తిరిగి

సమావేశమైనప్పుడు విపక్ష సభ్యులు SIR అంశంపై నినాదాలు చేస్తూ.. స్పీకర్ వెల్‌లోకి దూసుకెళ్లారు. గందరగోళ వాతావరణం మధ్య, లోక్‌సభ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (IIM) సవరణ బిల్లు, 2025ను ఆమోదించింది. సభ సజావుగా జరిగేందుకు అనుమతించాలని ప్రిసైడింగ్ ఆఫీసర్ నిరసన వ్యక్తం చేస్తున్న సభ్యులను పదే పదే కోరినప్పటికీ ఫలితం లేకపోవడంతో సభను రేపటికి వాయిదా వేశారు.

=====================

కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే... సుప్రీం కోర్టు పూర్వ న్యాయమూర్తి బి. సుదర్శన్ రెడ్డిని ఉపరాష్ట్రపతి ఎన్నికలకు భారత కూటమి అభ్యర్థిగా ప్రకటించారు. ఈరోజు మధ్యాహ్నం న్యూఢిల్లీలో జరిగిన విలేకరుల సమావేశంలో ఈ నిర్ణయాన్ని ప్రకటించిన ఆయన, ఇందుకు అన్ని ప్రతిపక్ష పార్టీలు అంగీకరించాయని పేర్కొన్నారు.

(వాయిస్ 30 సెకన్లు)

=====================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఎన్డీఏ కూటమి ఉపరాష్ట్రపతి అభ్యర్థి సి.పి. రాధాకృష్ణన్ ను ఏకగ్రీవంగా ఎన్నుకోవాలని అన్ని రాజకీయ పార్టీలకు విజ్ఞప్తి చేశారు. ఈ రోజు ఉదయం న్యూఢిల్లీలో జరిగిన ఎన్డీఏ పార్లమెంటరీ సమావేశంలో, రాధాకృష్ణన్ ను ఎన్డీఏ ఎంపీలకు పరిచయం చేశారు. పార్లమెంటు సభ్యుడిగా, గవర్నర్ గా వివిధ హోదాల్లో సి.పి. రాధాకృష్ణన్ సమర్ధవంతంగా పని చేశారని గుర్తు చేశారు. ఈ సమావేశం అనంతరం పార్లమెంటరీ వ్యవహారాల శాఖా మంత్రి కిరెన్ రిజిజు పాత్రికేయులతో మాట్లాడుతూ... రాధాకృష్ణన్ వివాదాలకు దూరంగా సరళమైన జీవితాన్ని గడిపారని, ఉపరాష్ట్రపతిగా ఆయన ఎన్నిక మొత్తం దేశానికి ఆనందదాయకమైన విషయమని చెప్పారు.

=====================

భారత విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్.జైశంకర్ మూడు రోజుల పర్యటన నిమిత్తం కొద్ది సేపటి క్రితం రష్యా కు చేరుకున్నారు. వాణిజ్యం, సాంకేతికత, సాంస్కృతిక సహకారం మొదలగు అంశాలపై రేపు జరగనున్న 26వ భారత్ రష్యా ఇంటర్-గవర్నమెంటల్ సెషన్‌కు ఆయన సహ అధ్యక్షత వహించనున్నారు.

=====================

కేంద్ర ప్రభుత్వ కార్యక్రామాలైన నేషనల్ క్రిటికల్ మినరల్స్ మిషన్, మిషన్ సుదర్శన్ చక్ర, వికసిత్ భారత్ రోజ్గార్ యోజన, నేషనల్ డీప్ వాటర్ ఎక్స్ ప్లోరేషన్ వంటి కార్యక్రమాలను ప్రస్తావిస్తూ.. కేంద్ర పెట్రోలియం శాఖా మంత్రి హర్దీప్ సింగ్ పూరి రాసిన ఒక వ్యాసాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ  ఈరోజు సామాజిక మాధ్యమం ఎక్స్ లో పంచుకున్నారు. దేశాన్ని అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా మార్చడమే కాకుండా వికసిత్ భారత్ వైపు పయనింపజేసేందుకు ఇవి దోహద పడతాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విశ్వాసం వ్యక్తం చేశారు.

విరామం

=====================

భారత్, చైనా దేశాల మధ్య సరిహద్దు సమస్యపై జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్, చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యిల మధ్య 24వ విడత ప్రత్యేక ప్రతినిధుల స్థాయి చర్చలు ఈరోజు న్యూఢిల్లీలో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అజిత్ దోవల్ మాట్లాడుతూ... గడిచిన తొమ్మిది నెలలుగా  సరిహద్దులో పరిస్థితులు మెరుగుపడ్డాయని, ప్రస్తుతం అక్కడ ప్రశాంత వాతావరణం కొనసాగుతుందన్నారు. చైనాలో జరిగే షాంఘై సహకార సంస్థ (SCO) శిఖరాగ్ర సమావేశానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హాజరవుతున్నారని అజిత్ దోవల్ ఈ సందర్భంగా ఆయన ప్రకటించారు.

====================

కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖా మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ వచ్చే అక్టోబర్ 3న "వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్"ను ప్రారంభించనున్నామని ప్రకటించారు. రైతులు, వ్యవసాయ శాస్త్రవేత్తల మధ్య ప్రత్యక్ష సంభాషణను ప్రోత్సహించడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని, ఇది అక్టోబర్ 18 వరకు కొనసాగుతుందని చెప్పారు. లోక్‌సభలో ప్రశ్నోత్తరాల సమయంలో ఈరోజు ఆయన అనుబంధ అంశాలకు సమాధానమిస్తూ.. ఈ కార్యక్రమంలో భాగంగా వేలాది మంది శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులు గ్రామాలకు వెళ్లి రైతులతో నేరుగా సంభాషిస్తారని తెలిపారు. ఆహార ఉత్పత్తిని పెంచడంతో పాటూ, నూతన సాంకేతిక పరిజ్ఞానాల గురించి రైతులకు అవగాహన కల్పిస్తారని శివరాజ్ సింగ్ చౌహాన్ తెలియజేశారు.

====================

ముంబై నగరంలో గత కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా జనజీవనం స్తంభించింది. పలు రైలు సేవలు కూడా తాత్కాలికంగా నిలిపివేశారు. భారత వాతావరణ శాఖ సమాచారం మేరకు ముంబైలోని అనేక ప్రాంతాలలో గత 24 గంటల్లో 200 మిల్లీ మీటర్ల కంటే ఎక్కువ వర్షపాతం నమోదైంది. తూర్పు శివారులోని విక్రోలిలో అత్యధికంగా 255.5 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. ముంబై నగరంతో పాటూ పొరుగు జిల్లాలకు ఇప్పటికే ఐఎండి రెడ్ అలర్ట్ జారీ చేసింది. దీంతో అనవసర ప్రయాణాలను రద్దు చేసుకోవాలని నగరవాసులకు అధికారులు సూచించారు. ముంబై మెట్రోపాలిటన్ ప్రాంతంలోని అన్ని ప్రైవేట్ కార్యాలయాలు, సంస్థలు ఉద్యోగులను ఇంటి నుండే పని చేయాలని సూచించారు.

====================

కజకిస్తాన్‌లో జరుగుతున్న 16వ ఆసియా షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో భారత మహిళా షూటర్ మను భాకర్ 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ విభాగంలో కాంస్య పతకాన్ని గెలుచుకున్నారు. సురుచి సింగ్, గులియాల, మను బాకర్ లతో కూడిన భారత జట్టు కూడా 1,730 పాయింట్లతో కాంస్య పతకాన్ని గెలుచుకుంది.

====================

కర్ణాటక, గుజరాత్, మధ్య మహారాష్ట్ర, కొంకణ్, గోవాలలో ఈరోజు అతి భారీ వర్షపాతం నమోదయ్యిందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) పేర్కొంది. ఛత్తీస్‌గఢ్, తెలంగాణ, విదర్భాలలో కూడా భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారి తెలియజేస్తూ...

(వాయిస్ 40 సెకన్లు)

====================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్.. మనసులోని మాట" కార్యక్రమం 125వ సంచిక ఈనెల 31వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు లేదా నరేంద్ర మోదీ యాప్‌కు ఈ నెల 29వ తేదీ సాయంత్రం వరకు పంపవచ్చు.

====================
====================